# జేఎన్‌టీయూహెచ్ దైనందిని ఆవిష్కరణ నేడు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూహెచ్ కొత్త ఏడాది(2025) దైనందిని, కాలమానిని ఆవిష్కరణ సోమవారం వర్సిటీ పరిపాలన భవనం ముందు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9గంటలకు ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ఆవిష్కరిస్తారన్నారు.

EENADU

# జేఎన్‌టీయూహెచ్ రెక్టార్, రిజిస్ట్రార్ పదవీకాలం పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ ఆచార్య విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వరరావుల పదవీకాలాన్ని వర్సిటీ పాలకమండలి పొడిగించింది. తాజాగా పాలకమండలి సమావేశం సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెక్టార్, రిజిస్ట్రార్‌ల పదవీకాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

EENADU

# త్వరలో వర్సిటీలకు పాలకమండళ్లు

## ప్రభుత్వానికి జాబితా పంపనున్న ఉన్నత విద్యా మండలి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నత విద్య పరిధిలోని 11 విశ్వవిద్యాలయాలకు కొత్త పాలకమండళ్లను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వాస్తవానికి మునుపటి పాలకమండళ్ల గడువు గత ఏడాది ఫిబ్రవరికే ముగియగా.. మార్చిలోనే కొత్త వారిని నియమించాలని సభ్యుల జాబితాను ప్రభుత్వానికి విద్యాశాఖ పంపింది. అయితే దానికి ఆమోదం లభించలేదు. రెండు నెలల క్రితం కొత్త ఉపకులపతులు వచ్చినందున వారి సిఫార్సు మేరకు కొత్త జాబితా పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వర్సిటీల నుంచి వివరాలు సేకరించి పంపించనుంది. ఒక పాలకమండలిలో వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్(జేఎన్‌టీయూహెచ్), విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్(సాంకేతిక వర్సిటీలకు), కళాశాల విద్యాశాఖ కమిషనర్(సంప్రదాయ వర్సిటీలకు), ఆర్థిక శాఖ కార్యదర్శితోపాటు సీనియర్ ఆచార్యుడు, ప్రిన్సిపల్, అనుబంధ కళాశాలల నుంచి ఒక ప్రిన్సిపల్, ఛైర్మన్, మరికొందరు విద్యారంగ ప్రముఖులు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం ఒక్క కాకతీయ వర్సిటీకి మాత్రమే పాలకమండలి ఉంది.

### 10వ తేదీలోపు సీఎంతో ఉపకులపతుల సమావేశం

వర్సిటీల ఉపకులపతులతో 10వ తేదీలోపు సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం ఉంటుందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఒక్కో వీసీతో 10-15 నిమిషాల పాటు భేటీ అవుతారు. ఆయా వర్సిటీల పరిస్థితి, సమస్యలపై వీసీలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

EENADU